క్లుప్తంగా

ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడిగా తిరుపతిరావు



తిరుపతిరావును సన్మానిస్తున్న నాగరాజు, తదితరులు

భామిని: భామిని మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సాలికిరికి చెందిన కె.తిరుపతిరావు ఎన్నికయ్యారు. ఆయన్ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట నాగరాజు ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకుడు బుజ్జి మాస్టారు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమం రేపు

వీరఘట్టం: మండలంలోని చిన్నగోరకాలనీ, కత్తులకవిటి గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సచివాలయాల సిబ్బంది, గ్రామ వలంటీర్లు, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో విధిగా పాల్గొనాలని సూచించారు.

ముమ్మరంగా కాలువల నిర్మాణం

పాలకొండ: నగరపంచాయతీలోని 9వ వార్డు పరిధిలో సీసీ రహదారులు, కాలువల నిర్మాణం ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ పనులను ఇంజినీరింగ్ అధికారులు ఆదివారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఏఈ వరప్రసాద్ మాట్లాడుతూ 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా మంజూరు చేసిన నిధులతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. సకాలంలో పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ర్యాంప్‌లు, సీసీరోడ్డు పూర్తి



మంచినీటి కోనేరులో నిర్మిస్తున్న ర్యాంప్

సీతానగరం: మండలంలోని సుమిత్రాపురంలో మంచినీటి కోనేరు శుద్ధి చేసి ప్రజలు చెరువులో దిగడానికి వీలుగా ర్యాంప్‌ల నిర్మాణంతోపాటు కొత్త కాలనీలో సీసీ రోడ్డు పనులు పూర్తయినట్లు పీఆర్ ఏఈ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బి శ్రీరాములు తెలిపారు. ఈ మేరకు గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను ఆదివారం పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న మంచినీటి కోనేరు లోతుగా ఉండడంతో నీరున్నసమయంలో ప్రమాదం జరుగుతుందని, కొత్తకాలనీకి రహదారి సౌకర్యం కోసం ఇబ్బందులు పడుతున్నందును సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ బి.నందినితో పాటు గ్రామస్తులు ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి తెచ్చారన్నారు. ఈ నేపథ్యంలో మంచినీటి కోనేరులో చెత్తను తొలగించడం, చెరువు గట్టును ఆనుకుని పూలమొక్కలు, ఫల జాతి మొక్కలు నాటడం, చెరువులో దిగనున్న వారికి రక్షణగా ర్యాంప్‌ల నిర్మాణం చేసినట్లు తెలియజేశారు. కొత్త కాలనీలో లక్షలాది రూపాయల సీసీ రోడ్డు నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్స నందిని, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా దేశమ్మతల్లి పండగ

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం దేశమ్మతల్లి వారాల పడుగను రైతులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో వరినారు పోసిన సందర్భంగా బూర్జ, కృష్ణారాయపురం, సుమిత్రాపురం, ఇప్పలవలస, అవాలవలస, దయానిధిపురం గ్రామాల్లో వారాల పండగలు జరిగాయి. వరి సాగు ప్రారంభ దశలో దేశమ్మ తల్లికి పూజలు నిర్వహించడం కోసం గ్రామ శివారులో ఉన్న వనం గుడి వరకూ రైతులు పాదయాత్రగా వెళ్లి అమ్మవారికి ప్రీతికరమైన పప్పు అన్నం మడపాలు, చీరలు, పసుపు, కుంకుమ, బియ్యం సమర్పించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నాటి నుంచి రైతులందరికీ ఆయురారోగ్యాలను అమ్మవారు ప్రసాదించి చల్లంగా చూడాలని కోరుతూ పూజలు చేశారు. అంతకు ముందు గ్రామాల్లో అమ్మవారి పూనకంతో ఉన్న మహిళలను బాకులతో తిరువీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు.

మొక్కలు సంరక్షించాలి

బలిజిపేట: సత్యసాయి యూత్ డే సందర్భంగా మండలంలోని పెదపెంకి ఉన్నత పాఠశాల ఆవరణలో భక్తులు ఆదివారం 100మొక్కలు నాటారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బి.తవిటిరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించడం ఎంతో అవసరమన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం వల్ల విద్యార్థులకు ఉపయోగపడతాయని, పాఠశాల ఆవరణ ఎంతో సుందరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు, జిల్లా సత్యసాయి సమితి కన్వీనర్ పి.నేతాజీనాయుడు, రాష్ట్ర యూత్ కోఆర్డినేటర్ కల్యాణ్, హెచ్‌ఎం భాస్కరరావు, సత్యనారాయణ, పి.గోపి, కె.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీను, బి.నారాయణరావు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు మహర్దశ

- గిరిశిఖర గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం పెద్దపీట
- కురుపాం నియోజకవర్గంలో రూ.92 కోట్లతో 97 బీటీరోడ్ల నిర్మాణం
- చురుగ్గా జరుగుతున్న పనులు



కురుపాం మండలం గొటివాడ పంచాయతీ పాత బల్లుకోట గిరిజన గ్రామ రహదారి నిర్మాణ పనులు



కురుపాం మండలం పాడి పంచాయతీలోని ఒప్పంగి గిరిజన గ్రామ రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: జగనన్న పాలనలో గిరిజన గ్రామాలకు మహర్దశ పట్టింది. గిరిజన గ్రామాలను కలుపుతూ ప్రభుత్వం రహదారుల నిర్మాణం చేపడుతోంది. ప్రాధాన్యత క్రమంలో అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తోంది. గత ప్రభుత్వాలు గిరిజనులను ఓటు బ్యాంకుగా చూడటమే తప్ప వారి కనీస అవసరాలు తీర్చలేకపోయాయి. గిరిశిఖర గ్రామాలకు సరైన రహదారులు లేకపోవడంతో రాకపోకలకు గిరిజనులు ఇబ్బందులు పడేవారు. అత్యవసర సమయంలో 108 వాహనం కూడా గ్రామాలకు చేరుకునేందుకు వీలులేని పరిస్థితి. దీంతో డోలి కట్టి రోగులను ఆస్పత్రికి తరలించాల్సి వచ్చేది. సమయానికి సరైన చికిత్స అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వారి కష్టాలు ఒక్కొక్కటిగా తీరుతున్నాయి. సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే వచ్చి చేరుతున్నాయి. గ్రామాల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఉన్నచోటే మెరుగైన విద్య, వైద్యం అందుతోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో గిరిజన ప్రాంతాలు మైదాన ప్రాంతాలతో అభివృద్ధిలో పోటీ పడుతున్నాయి.

రూ.92 కోట్లతో 97 బీటీరోడ్ల నిర్మాణం

కురుపాం నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కురుపాం మండలాల పరిధిలో ఉపాధిహామీ నిధులు రూ.92 కోట్లతో 145 కిలోమీటర్ల మేర 97 బీటీ రోడ్లను నిర్మిస్తోంది. పార్వతీపురం ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే సుమారు 130 గ్రామాలకు రహదారి కనెక్టివిటీ లభిస్తుంది. అలాగే గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు వీలుగా రూ.150 కోట్లతో ఇంజినీరింగ్ కళాశాలను నిర్మిస్తోంది.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం



గిరిజన ప్రాంతాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి శూన్యం. పాదయాత్రలో గిరిజన కష్టాలను తెలుసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కురుపాం నియోజకవర్గంలో రూ.150 కోట్లతో ఇంజినీరింగ్ కళాశాల మంజూర చేశారు. అలాగే రహదారుల నిర్మాణానికి సుమారు రూ.92 కోట్లు విడుదల చేశారు. ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ఆస్పత్రులు అభివృద్ధి చేస్తున్నాం. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాం.

– పాముల పుష్పశ్రీవాణి, కురుపాం ఎమ్మెల్యే

రహదారి లేక ఎన్నో ఇబ్బదులు పడ్డాం



మాది గొటివాడ పంచాయతీలోని పాత బల్లుకోట గిరిజన గ్రామం. దశాబ్దాలుగా మా గ్రామానికి రహదారి లేక కాలినడకనే రాకపోకలు సాగించేవాళ్లం. 108 అంబులెన్స్ కూడా వచ్చేది కాదు. గతంలో మా గ్రామానికి చెందిన గర్భిణిని వైద్య సేవలు కోసం డోలి కట్టి ఆస్పత్రికి తీసుకొని వెళ్తుండగా మార్గమధ్యలోనే ఆమె చనిపోయింది. ఇలా ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుత ప్రభుత్వం మా గ్రామానికి రోడ్డు నిర్మాణానికి రూ.1.76 లక్షలు మంజూరు చేసింది. ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇక మా కష్టాలు తీరనున్నాయి.

– ఆరిక భారతమ్మ, పాతబల్లుకోట గ్రామం, కురుపాం మండలం

చురుగ్గా పనులు చేపడుతున్నాం



సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న గిరిశిఖర గ్రామాలకు మంజూరైన రహదార్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. దశల వారిగా పనులు పూర్తి చేస్తాం. రోడ్లు అందుబాటులోకి వస్తే గిరిశిఖర గ్రామాలకు అన్ని సేవలు అందుతాయి.

– ఎస్.సింహాచలం, డీఈఈ, ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం, భద్రగిరి సబ్‌డివిజన్

నిషేధిత గడ్డిమందు విక్రయం!

కురుపాం: మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాల్లో నిషేధిత గడ్డిమందు గ్లైఫోషేట్ విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మందును వినియోగించడం వల్ల దీర్ఘకాలంలో భూసారం దెబ్బతినడంతో పాటు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఈ మందును నిషేధించింది. అయితే కొందరు వ్యాపారులు పక్క రాష్ట్ర ఒడిశా నుంచి దీన్ని తీసుకువచ్చి గుట్టుచప్పుడు కాకుండా రైతులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



1987-88 బ్యాచ్ విద్యార్థులు

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987–88 విద్యా సంవత్సరంలో పదోతరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు మండలంలోని పులిపుట్టిలో ఆదివారం కలుసుకున్నారు. రెవెన్యూ, పోలీస్, ఏపీ ట్రాన్స్‌కో, జీసీసీ, పంచాయతీరాజ్, ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడిన 60 మంది పూర్వ విద్యార్థులు తమ కుటుంబాలతో చేరుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సందడిగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. జీసీసీ మేనేజర్ గొర్లె నరసింహులు, ఎస్‌పీ పెంటయ్య, కాంతరావు, ఆనందరావు, సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై అభిమానంతో..



కురుపాంలో బైక్‌పై ప్రచారం చేస్తున్న అడవికొట్టు రాజు

కురుపాం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీ చేపడుతున్నట్లు నెల్లూరు జిల్లా జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన అడవికొట్టు రాజ తెలిపారు. కురుపాం నియోజకవర్గ కేంద్రానికి ఆదివారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలని భావించి మే 14 నుంచి బైక్ యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. ఇంతవరకు 130 నియోజకవర్గాల్లో ప్రచారం చేసినట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై సానుకూలంగా ఉన్నారని, మరోసారి జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను ప్రదర్శిస్తున్న ఇన్‌చార్జి

పాలకొండ రూరల్: పుస్తక పఠనం ద్వారా మేధోసంపత్తిని పెంచుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయ ఇన్‌చార్జీ అధికారి బి.గణేష్‌బాబు అన్నారు. గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఈశ్వరరావు ఉన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

భామిని: మండలంలోని దిమ్మిడిజోలకు చెందిన మత్స్యకారుడు కేవటి ఆదినారాయణ(59) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. మృతుని కుమారుడు దివ్యాంగుడు కావడంతో అతనికి ట్రై ఆటో మంజూరుకు సిఫార్సు చేస్తామన్నారు.

వారి వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కొవ్వాడ చిరంజీవులు, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహనబాబు, సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావు, వలరౌతు వెంకటరమణరావు ఉన్నారు.

రూపుకోల్పోయిన రాయుని కోనేరు



పాలకొండ రూరల్: స్థానిక వీరఘట్టం రహదారిలో అగ్నిమాపక కేంద్రం సమీపంలో ఉన్న రాయుడు కోనేరులో పూడికలు పెరిగిపోవడంతో రూపుకోల్పోయింది. స్థానికుల నీటి అవసరాలతో పాటు అగ్నిమాపక శకటం ట్యాంకర్ నింపేందుకు ఈ కోనేరుపై ఆధారపడేవారు. ప్రస్తుతం కోనేరులో పూడికలు, నాచు పెరిగిపోవడంతో నీరు దుర్వాసన వస్తోందని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి పూడికలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

కోటదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదురగమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంబరాలు చేసి మొక్కులు చెల్లించారు. ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద శర్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఆలయ హుండీ కానుకలను లెక్కించనున్నట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

పాలకొండ: నగరపంచాయతీలోని వెంకటరాయుని కోనేరు గట్టుపై ఉన్న పూర్వ విద్యార్థుల గ్రంథాలయం ఆవరణలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని అనాథలు, వృద్ధులకు నిత్యాన్నదాన కార్యక్రమం చేపడుతున్నామని నిర్వాహకుడు ప్రసాదరావు తెలిపారు.

నేడు మర్రిపాడులో 'గడపగడపకు..'

సీతంపేట: మండలంలోని మర్రిపాడు గ్రామంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సత్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, అధికారులు, వలంటీర్లు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా



తరలించేందుకు సిద్ధంగా ఉన్న కలప దుంగలు

భామిని: మండలంలో కలప దుంగల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు మితిమీరిపోతున్నారు. మండలంలోని అనంతగిరి–దిమ్మిడిజోల గ్రామాల మధ్య ఉన్న తోటల్లో చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా నరికివేసి తరలించేందుకు సిద్ధం చేశారు. గత కొన్నాళ్లుగా కలప రవాణాపై నియంత్రణ లేకపోవడంతో అక్రమంగా చెట్లు కొట్టేసి తరలించేస్తున్నారని స్థానికులు అంటున్నారు.

నారుమడుల్లో ఎరువులు వేయొద్దు

రేగిడి: ఖరీఫ్ సాగుకు సిద్ధం చేస్తున్న వరి నారు మడుల్లో రసాయనిక ఎరువులు వేయవద్దని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. ఆదివారం మండలంలోని అంబఖండి, ఉంగరాడ, వండానపేట తదితర గ్రామాల్లోని వరి నారుమడులను పరిశీలించిన ఆయన ప్రస్తుతం వాతావరణం ప్రతికూలంగా ఉందని, ఈ సమయంలో రసాయనిక ఎరువులు వేస్తే పంట పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఆర్‌బీకే సిబ్బంది సలహాలు, సూచనలు పాటిస్తూ వ్యవసాయం చేయాలని కోరారు.

● మంత్రికి శుభాకాంక్షలు



రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు విజయనగరంలోని ఆయన నివాసంలో ఆదివారం ఘనంగా జరిగాయి. కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు ఆయన్ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

బీజామృతంతో విత్తనశుద్ధి మేలు



రైతులతో సామూహికంగా విత్తనశుద్ధి చేయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం ద్వారా పంటలను ఆశించే తెగుళ్లను చాలా వరకు నివారించవచ్చని ఏపీసీఎన్‌ఎఫ్ పి.ఆమిటి క్లస్టర్ కోఆర్డినేటర్లు ప్రసాద్, రవి సూచించారు. మండలంలోని వంజరాపుగూడ గ్రామంలో ఆదివారం విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులతో బీజామృతం తయారు చేయించి విత్తనాలను శుద్ధి చేయించారు. విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసుకోవడం వలన మొలక శాతం పెరగటంతో పాటు హాని చేసే సూక్ష్మజీవుల నుంచి రక్షణ లభిస్తుందని, ఫలితంగా దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. వరి, చిరుధాన్యాలు, అపరాలు, నూనె గింజలు మొదలగు పంటలకు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు.

పచ్చిరొట్టతో సారవంతం



బూర్జలో రైతులు సాగుచేస్తున్న పచ్చిరొట్ట

సీతానగరం: ఖరీఫ్ వరి సాగు చేయాల్సిన పొలాలు సారవంతం అవడానికి మండలంలోని రైతులు వేసిన పచ్చిరొట్ట పంటలు దోహద పడతాయని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు బూర్జ, లక్ష్మీపురం, బుడ్డిపేట గ్రామాల్లో ఖరీఫ్ వరి పంటవేసే పొలాల్లో వేసిన పచ్చిరొట్ట పంటలను, వరినారుమడులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ వరిసాగు చేయాల్సిన మడులలో పచ్చిరొట్ట పంట చేయడంతో పచ్చిరొట్ట ఏపుగా పెరగడం వల్ల భూమిలో సారవంతమవుతుందన్నారు. సేంద్రియ ఎరువులు ఉత్పత్తి అవుతాయని తద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గించడానికి దోహద పడుతుందన్నారు. ఏటా ఖరీఫ్ వరినారు వేసే సమయంలో సేంద్రియ ఎరువు ఉత్పత్తి నిమిత్తం జీలుగు, కట్టెజనుము, పిల్లిపెసర పంటలు వేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

జోరుగా మొక్కజొన్న నాట్లు



దిమ్మిడిజోల వద్ద మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న కూలీలు

భామిని: మొక్కజొన్న సాగుపై మండల రైతులు మక్కువ చూపుతున్నారు. ఖరీఫ్, రబీలో వరి పంట తరువాత అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో రైతులు విత్తనాలు వేసుకోవడంలో నిమగ్నమయ్యారు.

సంప్రదాయ తాడుకట్టు విధానంలో కూలీలు వరుసలో నిలబడి ఒక క్రమపద్ధతిలో నాట్లు వేస్తున్నారు. ఈ విధాంగా నాటుకోవడం వల్ల పంట దిగుబడి పెరుగుతుందని రైతులు అంటున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



భామిని: వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: రహదారి ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎస్సై బి.శివప్రసాద్ అన్నారు. పాలకొండ–సీతంపేట, విశాఖ రహదారిలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేశారు. సరైన వాహన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపేవారిపై అపరాధ రుసుం విధించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భామిని: మండలంలోని లివిరి కూడలి వద్ద బత్తిలి పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఏబీ రోడ్డుపై వచ్చిపోయే వాహనాలను నిశితంగా తనిఖీ చేశారు. లైసెన్స్, సరైన ధ్రువపత్రాలు లేకుండా ప్రయాణించే వారిపై ఎస్సై యతిరాజుల అమ్మనరావు అపరాధ రుసం విధించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు, వాహన యజమానులకు సూచించారు.